కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 60, కీర 25, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 70, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 70, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (3) 10 , క్యాలీ ఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: రంజాన్ మాసంను పురస్కరించుకొని మాదాపూర్, కొండాపూర్ డివిజన్ల పరిధిలో ఆదిత్యనగర్, మార్తాండనగర్‌లలో ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపవాసంతో మంచితనం, సంస్కారం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, శ్రీనివాస్‌చౌదరి, తిరుపతి, ఖాదర్, కరీం, లియాఖత్, అబ్దుల్ మోయిజ్, అమీర్, మహ్మద్, అజీమ్ పాల్గొన్నారు.

ఆలయాలకు నోటీసులు ఇవ్వడం తగదు: బీజేపీ

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని కాళికామాత ఆలయానికి హైడ్రా అధికారులు ఇచ్చిన నోటీసును వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. నానక్‌రాంగూడలో 400 ఏళ్ల చరిత్ర కలిగిన కాళీకామాత ఆలయానికి హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో బీజేపీ నాయకులు ఆలయాన్ని పరిశీలించి అర్చకులు, నిర్వాహకులలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల భూములపై పడడం తగదన్నారు. బీజేపీ అధిష్టానంతో చర్చించి పెద్ద ఎత్తున ఆలయ పరిరక్షణకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దర్శన్‌సింగ్, కైలాస్‌సింగ్, శివసింగ్, కన్నయ్యలాల్, బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, తిరుపతి, వరలక్ష్మీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 8 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా, ముగ్గురికి రూ.1500, మరో వ్యక్తికి రూ. 2500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అమీన్‌పూర్‌కు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్

పటాన్‌చెరు: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన పాలన అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్‌కు నూతన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ మంజూరైన క్రమంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీతో పాటు రామచంద్రాపురం పరిధిలోని డివిజన్‌ల మున్సిపాలిటీలు నూతన పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి కిష్టారెడ్డిపేటలో గల పాత గ్రామ పంచాయతీ భవనాన్ని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

కొండాపూర్‌లో అవిక మైండ్ హబ్ ప్రారంభం


ప్రారంభిస్తున్న మహంకాళి శ్రీనివాసరావు

గచ్చిబౌలి: మానసిక రుగ్మతల నివారణ కేంద్రం అవిక మైండ్‌హబ్‌ను కొండాపూర్‌లో మంగళవారం టీహబ్ మాజీ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవన విధానంలో ఉరుకులు, పరుగుల జీవనంలో మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. మానసిక ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న టెక్ బేస్డ్ కంపెనీ అవికా తన సేవలను విస్తరించాలన్నారు.నేటి సమాజానికి మానసిక ఆరోగ్యం పెద్ద సమస్యగా మారిన తరుణంలో టెక్నాలజీ ఆధారిత క్లినిక్‌ను తీసుకురావడం విప్లవంగా అభివర్ణించారు. ఇకిగై క్లినిక్స్ డైరెక్టర్ డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ మణికాంత్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి మానసిక ఆరోగ్యం ఎంతో కీలకమన్నారు. అవికా సహ వ్యవస్థాపకురాలు శిరీష, వైద్య బృందం పాల్గొన్నారు.

చెప్పలేని ‘చివరి’ కష్టాలు

- వదేళ్లుగా పనులు చేస్తూ ఒకటి మధ్యలో వదిలేశారు
- రెండేళ్లుగా మరొకటి శంకుస్థాపనకే పరిమితం
- గోపన్‌పల్లి, ఖాజాగూడ శ్మశానవాటికల పరిస్థితి

మినీ మహా ప్రస్థానాల అభివృద్ధిని మరిచిన పాలకులు

రాయదుర్గం: దశాబ్దకాలంగా గోపన్‌పల్లి, ఖాజాగూడ శ్మశానవాటికలను మినీ మహా ప్రస్థానాలుగా మార్చాలనే ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలుకాలేదు. శ్మశానవాటికలలో మౌలిక వసతుల కల్పనకు గోపన్‌పల్లిలో పదేళ్ల క్రితం, ఖాజాగూడలో రెండేళ్ల క్రితం సంకల్పించారు. కానీ దశాబ్దకాలంగా ఈ రెండింటిలోనూ అభివృద్ధి మాత్రం లేదు. ఇప్పటి వరకు గోపన్‌పల్లిలోని మినీ మహాప్రస్థానం పనులు సాగినా మధ్యలో ఆగిపోయాయి. అదేవిధంగా రెండేళ్లయినా ఇప్పటివరకు ఖాజాగూడలోని మినీ మహాప్రస్థానంలో అసలు పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం.

రెండింటినీ ఆదర్శంగా మార్చాలని సర్వత్రా డిమాండ్

రాయదుర్గం ప్రాంతంలో వైకుంఠ మహాప్రస్థానం తరహాలో మినీ మహాప్రస్థానంలామార్చాలనే సంకల్పంతో రెండింటిని అభివృద్ధి చేయాలని తలపెట్టారు. వాటికి అవసరమైన నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాల్సి ఉండగా ఆ దిశగా పనులు జరగలేదు. ఏళ్లు గడుస్తున్నా పనుల ఊసే లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆధునిక వసతులతో ఈ రెండు శ్మశాన వాటికలను మినీ మహాప్రస్థానంలా మార్చాలని జనం కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఖాజాగూడలో 2023 మే 19న శంకుస్థాపన చేసిన శిలాఫలకం ఇదే

ఖాజాగూడలోని శ్మశానవాటికను మినీ మహాప్రస్థానంగా మార్చాలని 2023లో నిర్ణయించారు. 19వ తేదీ 2023 సంవత్సరంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 3 ఎకరాల స్థలంలో రూ.3 కోట్లతో ఈ శ్మశానవాటిక ఆధునికీకరణను తలపెట్టారు. ముఖ్యంగా గ్రీనరీ, ఫుట్‌పాత్, బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, బోరు, కుళాయి, స్నానపుగదులు, టాయిలెట్లు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. లైటింగ్, ప్రహరీగోడ నిర్మించాలనుకున్నారు.కానీ రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు.


గోపన్‌పల్లిలో 2015 అక్టోబర్ 29న శంకుస్థాపన చేసి శిలాఫలకం ఇదే

గోపన్‌పల్లి శ్మశానవాటిక అభివృద్ధికి అక్టోబర్ 29, 2015లో అప్పటి రవాణాశాఖ మంత్రి డాక్టర్ పి మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.1.54 కోట్లతో ఈ శ్మశానవాటికను మినీ మహాప్రస్థానంగా చేయాలని తలపెట్టారు.ఆ తర్వాత బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం, బెంచీలు, స్నానపు గదులు నిర్మించారు. మూడు వైపులా గేట్లు ఏర్పాటు చేశారు. కానీ కొన్ని నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారు. చెత్తాచెదారం, ముళ్ళచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించలేదు. ఇప్పటికీ అదే పరిస్థితి కనిపిస్తోంది. పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ముచ్చింతల్ గ్రామాన్ని సందర్శించిన రాజనీతిశాస్త్ర విద్యార్థులు

గ్రామీణాభివృద్ధి కోర్సులో భాగంగా పర్యటన



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని రాజనీతిశాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి వీరబాబు ఆధ్వర్యంలో మంగళవారం ముచ్చింతల్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో కల్పించిన సౌకర్యాలు, పారిశుద్ధ్యం, వృత్తి, ఆరోగ్యం, వైద్య సేవలు, విద్యుదీకరణ, వ్యవసాయం తదితర వివరాలను విద్యార్థులు సేకరించారు. ప్రభుత్వ పథకాల అమలు, డిజిటల్ అక్షరాస్యత, ప్రజల అభిరుచులు, విద్యార్థుల చదువు, తల్లిదండ్రుల వృత్తులు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్.వీరబాబు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి కోర్సులో ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలు, 29 అంశాలను పరిశీలించడానికి ఈ క్షేత్ర పర్యటన నిర్వహించినట్లు వివరించారు.

సైబరాబాద్ పరిధిలో వాహనాల వేలం

6 నెలల్లో వాహన యజమానులు పత్రాలు చూపి తీసుకోవచ్చు

రాయదుర్గం: సైబరాబాద్ పోలీసుల వద్ద వదిలివేయబడిన/క్లెయిమ్ చేయని వివిధ రకాల వాహనాలను వేలం వేసేందుకు ఏర్పాట్లు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఉన్నాయి. ఏవైనా అభ్యంతరాలు, వాహనాలు తీసుకోవాలనే ఆసక్తి ఉంటే సైబరాబాద్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ ముందు దరఖాస్తు దాఖలు చేసి నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరునెలల వ్యవధిలోపు వారి వాహనాలను క్లెయిమ్ చేసుకోవచ్చన్నారు. అలా చేయకపోతే వదిలివేయబడిన / క్లెయిమ్ చేయని వాహనాలను బహిరంగ వేలం వేస్తారు. వాహనాల వివరాలు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ వాహనాలు ఎంటీఓ–11 రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్ వీరలింగం నియంత్రణలో ఉంటాయి. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9490617317లో సంప్రదించాలి.

ఖాళీ జాగాలో వారాంతపు సంత

స్థలాన్ని పరిశీలించిన అధికారులు


ఫిలింనగర్‌లోని ఖాళీ జాగాను పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

ఫిలింనగర్: చిరు వ్యాపారులు రోడ్డుపై సంత నిర్వహిస్తుండడంతో అంబులెన్స్‌లు కూడా రాలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇటీవలే వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా ఫిలింనగర్‌లోని ఏబీఎన్ నుంచి దర్గా వెళ్లే రోడ్డులోని వారాంతపు సంతను మరోచోటికి మార్చారు. ఫలితంగా వ్యాపారులు ఇరుకైన స్థలంలో దుకాణాలు నిర్వహించుకోలేక ఇబ్బందులు పడుతుండటంతో మంగళవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన ఫిలింనగర్‌లో పర్యటించారు. ఏబీఎన్ నుంచి దర్గా వెళ్లే రోడ్డులో దీన్‌దయాళ్‌నగర్ బస్తీ వెనుక సీతారామస్వామి దేవాలయం వరకు సుమారు అర ఎకరం ఖాళీ స్థలం ఉండగా, ఇక్కడ సంత నిర్వహించుకోవడంతో పాటు రోడ్ల పక్కన ఉన్న చిన్న దుకాణదారులు కూడా ఇక్కడే తమ షాపులు ఏర్పాటు చేసుకునే విధంగా పరిశీలించారు. రాళ్లు, మట్టి దిబ్బలతో నిండి ఉన్న ఈ ప్రాంతాన్ని క్లీన్ చేస్తే వారాంతపు సంతతో పాటు ఈ రోడ్డులో ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఏర్పాటు చేసిన దుకాణదారులకు కూడా షెల్టర్ ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుందని వారు తెలిపారు. స్థానిక నేతలు రామాంజనేయులు, శ్రీశైలం ఈ విధానాన్నే సూచించారు. అధికారుల నిర్ణయం పట్ల స్థానికులు కూడా హర్షం వ్యక్తం చేశారు. సంతలో కూరగాయలు అమ్ముతూ వందల మంది ఉపాధి పొందుతున్నారని, రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని చాలామంది ఉపాధి పొందుతున్నారని, వీరంతా ఉపాధి కోల్పోకుండా చూస్తామని అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీ కూడా ఈ ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు అంగీకరించింది.

‘రాజీవ్ యువవికాసం’ను సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, యువకులు

- ఏప్రిల్ 5 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: రాజీవ్ యువవికాసం పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకానికి ఏప్రిల్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకంలో అన్ని కులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. 60 నుంచి 80 శాతం సబ్సిడీ అందిస్తోందన్నారు. దరఖాస్తునకు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. పాన్‌కార్డు, పాస్‌పోర్టు ఫోటో, ఫోన్ నెంబర్, బ్యాంకు పాస్ బుక్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒక రేషన్ కార్డులోని సభ్యులలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నల్లగండ్లలో పథకంపై అవగాహన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజీవ్ యువ వికాసం పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ఈ స్కీంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన యువతకు రూ.4 లక్షల వరకు రుణాలను అందిస్తారన్నారు. ఏప్రిల్ 5 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాలింగ్ యాదగిరిగౌడ్, కృష్ణ ముదిరాజ్, శ్రీనివాస్, రేణుక, సునీతారెడ్డి, నాగమణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న చందానగర్ భవానీపురం కాలనీవాసులు

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలో కనీస సౌకర్యాలు కల్పించాలని చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కార్యాలయంలో భవానీపురం కాలనీ అసోసియేషన్ సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, నాలా నిర్మాణం, పార్కులు అభివృద్ధి చేయాలని కోరినట్లు జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. రఘునాథ్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, పర్వతరెడ్డి, సందీప్, రాఘవులు, ప్రకాష్‌రావు, దయాకర్‌రెడ్డి, విజయ సారధి పాల్గొన్నారు.

బైక్‌పై వచ్చి.. గొలుసు లాక్కెళ్లారు

మియాపూర్: ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి వాకింగ్ చేస్తున్న వ్యక్తి మెడలోనుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నార్నె ఎస్టేట్స్ లగ్జరియస్ విల్లాలో నివాసముంటున్న రాజా పూర్ణచందర్‌రావు ఆదివారం రాత్రి వాకింగ్‌కు వెళ్లాడు. చంద్రబాబు నాయుడు గెస్ట్‌హౌస్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్రవాహనంపై ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుండి వచ్చి అతని మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కొని వెళ్లిపోయారు. గొలుసు నాలుగు తులాలు ఉంటుందని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం


శ్రీను (ఫైల్)

మియాపూర్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ప్రేమ్‌నగర్ బి బ్లాక్‌లో బానోతు శ్రీను(38), లలిత దంపతులు నివాసముంటున్నారు. శ్రీను కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో శ్రీను మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. దీంతో భార్య, కూతుర్లు మందలించారు. దీంతో 11 గంటల సమయంలో శ్రీను ఇంటినుండి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆశావర్కర్ల నిరసన

పటాన్‌చెరు: ఆశా వర్కర్ల చలో హైదరాబాద్ సందర్భంగా జరిగిన అక్రమ అరెస్టులను ఖండించాల్సిన అవసరం ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు అన్నారు. ఆశ వర్కర్ల అక్రమ అరెస్టులకు నిరసనగా మంగళవారం పట్టణంలోని శ్రామిక్ భవన్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌక్ లో ఆశ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పట్టణాలు గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాల విజయవంతంనకు కృషి చేస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని 18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు.


నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

వైద్య సేవలపై అవగాహన కల్పించాలి


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ తదితరులు

కూకట్‌పల్లి: బస్తీదవాఖానాల్లో అందించే వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మండలంలోని హౌసింగ్ బోర్డు నాల్గవ ఫేజ్‌లోని బస్తీ దవాఖానాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె దవాఖానాల్లో ఓపీ సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలందించేందుకు మెడికల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేని చోట్ల వెంటనే నియమించాలన్నారు. పల్లె దవాఖానాకు రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారని, అందుతున్న వైద్య సేవలు, మందుల రికార్డులను పరిశీలించారు. గత నాలుగు మాసాలుగా మందుల జారీకి సంబంధించిన రికార్డుల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా బాలాజీనగర్ పల్లె దవాఖానను పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి ఉమా గౌరి, కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయువిహార్ కాలనీలో సుమారు 48 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం జీహెచ్‌యంసి అధికారులతో కాలసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీలలో ప్రజలనుండి వచ్చిన వినతుల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అత్యవసరమున్నచోట అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అన్నివేళలా ప్రజలకు అందుబాటులో వుంటూ అభివృద్ధే లక్ష్యంగా హైదర్‌నగర్ డివిజన్‌ను అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

కూకట్‌పల్లి: సీపీయం కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్ చుట్టుపక్కల బస్తీలలో నెలకొన్న లోఓల్టేజీ సమస్యలు పరిష్కరించాలని ఆల్విన్ కాలనీ ఏఈ పీరయ్య నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులనుంచి లోఓల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సీపీఎం మండల కార్యదర్శి ఏ.శంకర్ పేర్కొన్నారు. హనుమాన్‌నగర్ దీనబంధు కాలనీ, ప్రగతినగర్, రామకృష్ణనగర్, పాపిరెడ్డి కాలనీ తదితర బస్తీలలో లోఓల్టేజ్ సమస్య వలన ఫ్రిడ్జ్, ఫ్యాన్‌లు, టీవీలు చెడిపోతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పోలయ్య, కృష్ణారావు, డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి



శంషాబాద్: పండగలు శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు. పట్టణంలో డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఆర్‌జీఐఏ, శంషాబాద్, కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలతో శాంతికమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పండగ ఏర్పాట్లపై మాజీ ప్రజాప్రతినిధులు, స్థానికులు ఈ సందర్భంగా వివరించారు. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు, శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు

గచ్చిబౌలి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ జన్మదినం సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, యువత, స్నేహితులు, కాలనీవాసులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, మైనార్టీ విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్ అన్నారు. రాజేంద్రనగర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రణయ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో గత ఆరేండ్ల నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8,258 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రూ.23,108 కోట్లు కేటాయింపు చేసిందని..అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో గతం కంటే 0.2 శాతం మాత్రమే పెంచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు.

రాజేంద్రనగర్ మండల కమిటీ..

రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా జె.తనిష్క్ యాదవ్, ఇ.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా డి.సంజయ్, ఆర్.కౌశిక్, జై.కిశోర్, ఎ.సంజయ్, సహాయ కార్యదర్శిగా డి.రాజు, ఆర్.మహేశ్, ఎస్.తులసిప్రియ, జి.కౌశిక్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్ ఎం.కమలేష్, ఎస్.వంశీ, జె.కార్తీక్, ఎం.అనిత, కుమార్‌తో కమిటీ వేశారు.